సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



కొత్త ఆలోచనలు.. సరికొత్త ఆవిష్కరణలు.. - 8లో

పార్వతీపురం పట్టణానికి చెందిన గెంబలి గౌతమ్ సరికొత్త ఆవిష్కరణలతో ఆకట్టుకుంటున్నారు.



జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు

పార్వతీపురం జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. - 8లో



గిరిజన యూనివర్సిటీకి పరిశోధనా ప్రాజెక్టు - 8లో

కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బయోటెక్నాలజీ విభాగానికి రూ.4 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టు మంజూరైంది.

న్యూస్‌రీల్

రేపు మంత్రి కొండపల్లి జిల్లాకు రాక

పార్వతీపురం టౌన్: రాష్ట్ర చిన్న సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాకు సోమవారం వస్తారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- పోక్సో కేసు నమోదు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయస్సుగల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన బాలుడి (15)పై పోక్సో కేసు నమోదు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో చిన్నారి ఆడుకుంటుండగా బాలుడు వారి ఇంటికి వెళ్లాడు. చిన్నారి తల్లి ఇంటి వెనుక భాగంలో వంట చేసుకుంటుండగా బాలికను ఇంటిలోని మంచంపైకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడవడంతో అక్కడి నుంచి జారుకున్నాడు. బాలికను పరిశీలించిన తల్లికి రక్తం చారలు కనిపించడంతో ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. బాలుడిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. తహసీల్దార్ ప్రసాదరావు, సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐలు సీహెచ్ నవీన్‌పడాల్, బి.దేవి బాలిక తల్లి స్టేట్‌మెంట్‌ను రికార్డుచేశారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కోంద్రు అఖిల అనే 18 ఏళ్ల యువతిపై అదే గ్రామానికి చెందిన ఓ నిందితుడు కత్తితో దాడి చేయడంతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను జెడ్పీ చైర్మన్ శనివారం ఆస్పత్రిలో పరామర్శించారు. బాధిత యువతికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అధైర్య పడొద్దని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులకోసం పార్టీ తరఫున రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలపై దాడిఘటన విషయాన్ని తెలుసుకున్న మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ యువతిని పరామర్శించి, అండగా ఉండాలని చెప్పారన్నారు. కొద్దిరోజుల కిందట భీమిలి నియోజకవర్గంలో కూడా ఓ యువతి తల్లిని చంపేశారని, యువతి ప్రాణాప్రాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోందన్నారు. ఇదే నియోజకవర్గంలో చిన్నారిపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడ్డడాని చెప్పారు. రాజమండ్రిలో ఫార్మసీ విద్యార్థిని 12 రోజులపాటు ప్రాణాలతో పోరాడి చనిపోయిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. వీధిరౌడీల్లా మహిళలపై తెగబడుతున్నారన్నారు. పట్టపగలే ఇళ్లలోని చొరబడి దాడులుకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి భయానక పరిస్థితులను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రాజమండ్రి నిందితుడిని ఇంతవరకు పట్టుకోలేదన్నారు. మహిళలపై రోజుకి 60, 70 సంఘటనలు జరుగుతుండడం విచారకరమన్నారు. ఆడపిల్లలపై చేయివేస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని కూటమి నేతలు చెప్పారని, మరి ఇంతవరకు ఎంతమందని శిక్షించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కిల్లీ బడ్డీల్లో కూడా మద్యం ఏరులై పారుతోందన్నారు. గంజాయి నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

మీ పని సరే.. మాకేంటి?

- అవినీతిలో మునుగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రతి పనికీ లంచమే..
- దస్త్రం కదలాలంటే ముడుపులు అందించాల్సిందే అన్న ఆరోపణలు
- జిల్లా అధికారులు సైతం ఇదే కోవలో..
- ఏసీబీ దాడులు జరుగుతున్నా.. వెరవని వైనం

సాక్షి, పార్వతీపురం మన్యం:

ప్రభుత్వ శాఖల్లో రూ.లక్షల్లో జీతాలు. ఫ్యాను కింద ఉద్యోగాలు. విధి నిర్వహణలో బయటకు వెళ్లాలన్నా.. టీఏ, డీఏలు. సమయం 'మించకుండా' పనివేళలు. ఇంతకంటే ఇంకేం కావాలి ఎవరికైనా? కానీ.., అక్కడితో ఆగిపోతే మజా ఏముంటుంది.. దొరికినదగ్గర నొక్కేయాలి. అందినకాడికి దోచేయాలి. రూ.లక్షలు.. కుదిరితే రూ.కోట్లు వెనకేసేయాలి. ఇదీ.. వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో కొంతమంది ఉద్యోగుల అవినీతి కక్కుర్తి. ఈ శాఖ, ఆ శాఖ అన్న తేడా లేకుండా ప్రతి విభాగంలోనూ అవినీతి చెదలు పట్టిపీడిస్తున్నాయి. తరచూ ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా.. దొరికిన వారిలో జిల్లా అధికారులే ఉంటున్నా.. ఏ ఒక్కరిలోనూ భయం ఇసుమంతైనా కనిపించడం లేదు. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదో విధంగా పని జరగాలన్న ఉద్దేశంతో అవినీతి ఉద్యోగులు అడిగినంత ముట్టజెబుతున్నారు. పలు శాఖల్లో కొంతమంది ఉద్యోగులే పైసా వసూల్ కింగ్‌మేకర్‌లుగా మారుతున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వారి పేర్లను సైతం చెబుతుండడం గమనార్హం.



మత్స్యశాఖలో అవినీతి తిమింగలాలు

మత్స్యశాఖలో అవినీతి తిమింగలాలే తిరుగుతున్నాయి. ఇటీవల చేపపిల్లల ఉత్పత్తి, అమ్మకందారుని వద్ద రూ.60 వేలు లంచం తీసుకుంటూ స్వయంగా జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. వాస్తవానికి చేప పిల్లల పెంపకంలో రూ.కోట్లాది నిధులు దుర్వినియోగమవుతున్నాయి. జలాశయాల్లోకి, చెరువుల్లోకి ఎన్ని చేప పిల్లలు వదులుతున్నారు.. ఎన్ని బతుకుతున్నాయన్న విషయంలో స్పష్టమైన లెక్కలుండవు. ఇదే అదునుగా పెద్ద ఎత్తున నిధుల స్వాహాకు ఈ శాఖలో అధికారులు ఎప్పటి నుంచో అలవాటుపడ్డారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 57 లక్షల చేప పిల్లలు అందించారు. దీనికోసం రూ.82 లక్షల వరకు ఖర్చు చేశారు. టెండర్ల ప్రక్రియలోనే పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు పలువురు కాంట్రాక్టర్ల నుంచి వినిపించాయి.

వైద్యంలో అవినీతి మరకలు

జిల్లా వైద్యశాఖ అవినీతికి కేరాఫ్ మారిందన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ ఓ ఉద్యోగి ఎన్నోఏళ్లుగా తిష్ట వేసి ఆమ్యామ్యాల విషయంలో అంతా తానై నడిపిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల వైద్యారోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పోస్టులు నియమించడంపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. క్వాలిటీ కన్సల్టెంట్, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్, మెడికల్ అధికారి, జిల్లా ప్రాగ్రాం కోఆర్డినేటర్, డాట్ ప్లస్ సూపర్‌వైజర్, అకౌంటెంట్ తదితర పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. వీటికి అర్హతలను పక్కనపెట్టి, సిఫారసులకే ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం.

మున్సిపాలిటీలో లంచం ప్రిన్సిపల్

పురపాలక సంఘాల్లో చేయి తడపనిదే ఏ పనీ కావడం లేదు. కొద్దిరోజుల కిందట పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. పుట్టిన తేదీ మార్పు విషయంలో ఈ లంచం డిమాండ్ చేయడం గమనార్హం. గతంలో సాలూరు పురపాలక సంఘం కమిషనర్ సైతం ఏసీబీ వలలో చిక్కారు. పురపాలక సంఘం, నగర పంచాయతీ అధికారులు, ఉద్యోగులు తరచూ లంచాల కేసులో దొరికిపోతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. పార్వతీపురంలోని టీపీవో, రెవెన్యూ సెక్షన్లలో ముడుపులు అందిస్తేనే ఏ పనైనా జరిగేది.

దోచుకున్న వారికి ఉపాధి

గ్రామీణులకు ఉపాధి కల్పించి, వలసలను నివారించాలన్న ప్రధాన ఉద్దేశంతో కేంద్రం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం.. అధికారులకు, అందులో పని చేస్తున్న ఉద్యోగులకు 'ఉపాధి'గా మారింది. జిల్లాలోని 450 పంచాయతీల పరిధిలో సుమారు 3.96 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. 2 లక్షలకు పైగా జాబ్ కార్డులున్నాయి. ఈ ఏడాది వేతన చెల్లింపుల కిందే రూ.322 కోట్లు అందజేశారు. ఈ పథకం అక్రమార్కులకు వరంగా మారిందన్న విమర్శలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఇటీవల పార్వతీపురం మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న విషయం బహిర్గతమైంది. మండలంలోని 30 పంచాయతీల్లో రూ.26.13 కోట్లతో చేపట్టిన 2,412 పనులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టగా.. హార్టికల్చర్ పథకంలో లక్షల రూపాయాలు అక్రమాలు జరిగాయని గుర్తించారు. క్షేత్రస్థాయి సిబ్బంది వేతదారులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని తెలిసింది. మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు రికార్డుల్లో నమోదు చేశారుగానీ.. క్షేత్రస్థాయిలో అంత ఖర్చు కాలేదని సిబ్బంది తేల్చారు. జిల్లావ్యాప్తంగా ఉపాధి పనుల్లో ఇదే తతంగం నడుస్తోంది. ఒక్కొక్క వేతనదారు వద్ద ప్రతి వారం రూ.50 నుంచి రూ.100 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని వినికిడి. ఈ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విద్యాశాఖలో అవినీతి చీడ

జిల్లా విద్యాశాఖలో అవినీతికి అంతులేకుండా పోతోందన్న విమర్శలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతుందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఇక్కడ ఎలాంటి పనులు జరగాలన్నా.. ఇద్దరు వ్యక్తులను ప్రసన్నం చేసుకోవాల్సిందేనని, వారికి ముడుపులు అందిస్తే చాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చిన్నచిన్న ప్రైవేట్ పాఠశాలల రికగ్నైజేషన్ కోసం భారీగా ముడుపులు స్వీకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. డబ్బులిచ్చిన వారికి వెంటనే రెన్యువల్ ఆర్డర్లు ఇస్తారని.. లేకుంటే ఏదో కారణం చెప్పి నెలల తరబడి తిప్పుతారని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. ఉపాధ్యాయుల సర్వీసు పనులు, బిల్లులు, అనుమతులు, కొనుగోలు, పంపిణీ వంటివన్నీ ఓ 'ఉపాధ్యాయుడు' అనుమతితో జరగాల్సిందే అన్న ఆరోపణలున్నాయి.

డబ్బులిస్తేనే వెలుగు...

సాక్షాత్తు వెలుగు ఏపీడీ మీద కొద్దిరోజుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా పంచాయతీ కార్యాలయంలో డబ్బులిస్తేనే గానీ ఫైళ్లు కదలని పరిస్థితి. రెవెన్యూ కార్యాలయాలు అవినీతికి చిరునామాగా మారాయి. ఐటీడీఏలోని ఇంజినీరింగ్, డీడీ సెక్షన్లలో భారీ స్థాయిలో నిధులు స్వాహా అవుతున్నాయి. ఏళ్ల తరబడి ఇక్కడ తిష్ట వేసిన ఓ ఉద్యోగి 'కింగ్ మేకర్' అన్న ఆరోపణలున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికీ పర్సంటేజీలే. ట్రెజరీ కార్యాలయాల్లో ఏ బిల్లు కదలాలన్నా.. ముడుపులు అప్పగించాల్సిందే. ఇటీవల ఓ శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తి.. తన పదవీ విరమణ ప్రయోజనాల కోసం నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగారు. చివరికి లంచం ఇస్తేనే గానీ అక్కడ పని జరగలేదని ఆయన వాపోయాడు. ఐసీడీఎస్‌నూ అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. ఇటీవల ఇక్కడ చేపట్టిన తాత్కాలిక, ఒప్పంద ఉద్యోగాల నియామకాల్లోనూ పెద్ద ఎత్తున నగదు చేతులు మారాయన్న గుసగుసలు వినిపించాయి. బాలింతలు, పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి.

సీతారాముల కల్యాణం చూతము రారండి

నెల్లిమర్ల రూరల్: జిల్లాలోని రామాలయాలన్నీ సీతారాముల కల్యాణోత్సవానికి ముస్తాబయ్యాయి. మామిడి కొమ్మల తోరణాలు, పూలదండలతో అలంకరించిన పందిళ్లు, విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయాలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి ఆలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయింది. స్వామివారి కల్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు అనువుగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నమందు కల్యాణ ఘట్టం పూర్తికాగానే స్వామివారి ముత్యాల తలంబ్రాల పంపిణీకి ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేయించారు. ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పోలీసులు సుమారు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తుకు సన్నద్ధమయ్యారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ

రామతీర్థంలో రాములోరి కల్యాణోత్సవ ఏర్పాట్లను ఆర్డీఓ దాట్ల కీర్తి శనివారం పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి స్వామివారి కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆమె వెంట ఈఓ శ్రీనివాసరావు ఉన్నారు.



రామతీర్థం కల్యాణవేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి

ఉలిక్కిపడిన శివరాం





చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో యువతికి ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

- ఇంటి ఆవరణలో పనిచేస్తున్న యువతిపై కత్తిపోట్లు
- ముఖానికి మంకీ క్యాప్ ధరించి కత్తితో పొడిచి పరారైన దుండగుడు
- యువతికి తీవ్రగాయాలు
- విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన ఎస్పీ వకుల్ జిందల్
- డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్స్‌తో ఆధారాలు సేకరణ
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): పట్టపగలు.. అందరూ వీధిలో తిరుగాడుతుండగా.. శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి ఆవరణలో పాత్రలు కడిగే పనుల్లో నిమగ్నమైన యువతిపై ముసుగు వేసుకుని వచ్చిన యువకుడు కత్తితో దాడి చేసి పరారైన ఘటనతో గరివిడి మండలం శివరాం గ్రామం ఉలిక్కిపడింది. ఎన్నడూ చూడని, జరగని విధంగా యువతిపై దాడిచేయడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి మహిళలకు రక్షణలేదన్న మాటే అందరినోటా వినిపించింది. ఇంటివద్ద ఉంచినా అమ్మాయిలకు రక్షణ కల్పించలేకపోతున్నామన్న ఆవేదన గ్రామస్తుల్లో కనిపించింది. మద్యం ఏరులై పారుతుండడం, గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో కొందరు యువకులు భయం లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నాంటూ జనం మండిపడ్డారు.



క్లూస్‌టీం వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ



అఖిల సోదరుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్పీ

అదును చూసుకుని...

శివరాం గ్రామానికి చెందిన బాధితురాలు కోంద్రు అఖిల తల్లిదండ్రులతో పాటు నానమ్మ, ఇద్దరు అన్నదమ్ములతో కలిసి ఉంటోంది. తల్లిదండ్రులు, అన్నదమ్ములు పనికి వెళ్లిపోయారు. నాన్నమ్మ, అఖిల మాత్రమే ఇంటిలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన యువకుడు సినిమా సన్నివేశాన్ని తలపించేలా మంకీ క్యాప్ ధరించి పరుగున ఇంటి పనుల్లో నిమగ్నమైన అఖిల వద్దకు వెళ్లాడు. క్షణం ఆలోచించకుండా విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. కడుపు పక్కభాగంలో రెండు చోట్ల గాయపరిచాడు. యువతి కేకలు వేయడంతో పరారయ్యాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇంటిలో ఉండే ఆడబిడ్డ కత్తిదాడికి గురై ప్రాణాపాయ స్థితికి చేరడంతో తల్లిదండ్రులు, అన్నదమ్ములు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యువతి పరిస్థితి విషమం...

కత్తిపోట్లకు గురైన అఖిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యబృందం తెలిపినట్లు బంధువర్గాలు చెబుతున్నాయి. యువతి కడుపులోకి బలంగా కత్తిపోట్లు వెళ్లడంతో లోపల లివర్ భాగానికి తగిలి రక్తస్రావం జరుగుతోంది. ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా ఉన్నట్టు యువతి బంధువులు తెలిపారు.

ఎస్పీ సందర్శన..

సంఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్పీ వకుల్‌జిందాల్ గ్రామానికి చేరుకుని డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం సీఐ ఉపేంద్ర, గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావుతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో సాంకేతిక ఆధారాలు సేకరించారు. యువతిపై జరిగిన దాడి కేసు మిస్టరీని ఛేదిస్తామని ఎస్పీ తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని, వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

ఈ దాడి సంఘటనలో పోలీసులు అదే గ్రామానికి చెందిన ప్రధాన అనుమానితుడు బూర్లె ఆదినారాయణతో పాటుగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ముస్లింలకు వెన్నుపోటు




సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ షఫీ

- వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలపడం అన్యాయం
- ముస్లింలకు అండగా వైఎస్సార్‌సీపీ మద్దతు
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ షఫీ

పార్వతీపురంటౌన్: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలపడం అంటే ముస్లిం సోదరులకు వెన్నుపోటు పొడవమేనని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్‌షఫీ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ కూటమి ప్రభుత్వానికి ముస్లింలపై చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా ఎన్‌డీఏ మిత్ర పక్ష ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై జిల్లాలోని ముస్లిం సోదరులంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యమైన టీడీపీ, జనసేన పార్టీలు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం విచారకరమన్నారు. ఏప్రిల్ 2వ తేదీ యావత్ భారత దేశంలోని ముస్లిం సమాజానికి చీకటి దినంగా పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా అన్ని విధాలా చేదోడు వాదోడుగా నిలిచారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు గడవక ముందే ముస్లింలకు తీరని అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.కె.మహ్మద్ జలాల్, ముస్లిం సోదరులు షేక్ ఇబ్రహీం, షేక్ బాబ్జానీ, అబీబ్, పీరు, ఆజాన్ తదితరులు పాల్గొన్నారు.


దుర్మార్గం



కూటమి ప్రభుత్వం వక్ఫ్ బిల్లు సవరణకు మద్దతు ఇవ్వమని చెప్పి తీరా పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు తెలిపి ముస్లింలను మోసంచేయడం దుర్మార్గం. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నిస్సిగ్గుగా స్వార్థపూరిత ఆలోచనలతో బిల్లుకు మద్దతు నిచ్చారు.

– షేక్ జిలాని, కురుపాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు

ముస్లింల ద్రోహి చంద్రబాబు



వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు నిచ్చిన టీడీపీ, జనసేన పార్టీలకు రానున్న రోజుల్లో ముస్లింలు బుద్ధిచెబుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లు ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రంజాన్ మాసానికి ముందు మీకు అండగా ఉంటామని, సవరణ జరగదని చెప్పిన కూటమి నాయకులు సవరణ బిల్లుకు ఆమోదం తెలిపి ముస్లింలను మోసం చేశారు.

– షేక్ మహ్మద్ జలాల్, పార్వతీపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు

ముస్లింలు క్షమించరు



వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన బాబును ముస్లిం ప్రజాసంఘాలు, నాయకులు అసలు క్షమించరు. బిల్లు సవరణ చేయడమంటే ముస్లింలకు తీవ్రంగా అన్యాయం చేసినట్లే. ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందితే జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతాం.

– మహ్మద్ అబ్దుల్‌హుక్, సాలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు

క్లుప్తంగా

గ్రూప్ - 2 ఫలితాల్లో శ్రీనివాస్ సత్తా


సుంకర శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ - 2 మెయిన్ ఫలితాల్లో మండలంలోని సుంకరిపేటకు చెందిన మాజీ వాయుసేనాని సుంకర శ్రీనివాస్ సత్తా చాటారు. 2004 నుంచి 20 సంవత్సరాల పాటు ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మన్‌గా సేవలు అందించి 2024 జనవరిలో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ.. గత నెలలో విడుదలైన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పోటీ పరీక్షల్లో జీఎస్‌టీ అండ్ కస్టమ్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. అయితే గ్రూప్ - 2 ఫలితాల్లో విజేతగా నిలవడంతో ఈ పోస్టులోనే జాయిన్ అవుతానని శ్రీనివాస్ తెలిపాడు.

యువకుడి అదృశ్యం


చింతల కిశోర్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని జోకిశీల గ్రామానికి చెందిన చింతల కిశోర్ అనే యువకుడు ఈ నెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదు. అతని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపారు. ఖాళీగా ఉంటున్న నేపథ్యంలో తల్లిదండ్రులు కిశోర్‌ను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

- పది మందికి గాయాలు


తీవ్రంగా గాయపడిన లక్ష్మున్నాయుడు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తలకు గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పక్కి గ్రామంలో ఒకరు మృతి చెందగా.. కొండదేవుపల్లి గ్రామానికి చెందిన బంధువులు పరామర్శకు ఆటోలో బయలుదేరారు. సరిగ్గా కమ్మువలస వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడడంతో అందులో ఉన్న పదిమందికీ గాయాలయ్యాయి. వెంటనే వీరిని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా.. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. వీరిలో బి.పారినాయుడు, లక్ష్మున్నాయుడు తలలకు గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను ఎమ్మెల్యే బేబినాయన, డీఎస్పీ భవ్యారెడ్డి, తదితరులు పరామర్శించారు.

మద్యం సీసాల పట్టివేత

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటిలో 65 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యు. మహేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం గ్రామంలో తనిఖీలు చేపడుతుండగా.. మహేష్ ఇంటిలో మద్యం బాటిళ్లు దొరికాయి. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో సిబ్బంది తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల శాల కూలి ఆవు మృతి


మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న వీఆర్‌ఓ రాజేంద్ర, గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని దశమంతపురం గ్రామంలో పశువుల శాల కూలి ఆవు మృతి చెందింది. శుక్రవారం రాత్రి భారీగా కురిసిన వర్షానికి కెంగువ గణేష్‌కు చెందిన పశువుల శాల కూలిపోయింది. ఆ సమయంలో శాలలో రెండు ఆవులు, రెండు దూడలుండగా.. ఒక ఆవు, రెండు దూడలు తప్పించుకున్నాయి. ఒక ఆవు మాత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ రాజేంద్ర శనివారం గ్రామానికి చేరుకుని పశువుల శాల, ఆవు కళేబరాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని చెప్పారు. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటుకు మరో ఆవు..


మృతి చెందిన ఆవు

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీ శివారు కొత్తూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం పిడుగు పడడంతో పి. సత్యనారాయణకు చెందిన ఆవు మృతి చెందింది. ఇంటి సమీపంలోని కళ్లంలో ఆవును కట్టగా.. ఒక్కసారిగా పిడుగు పడడంతో తమ జీవనాధారమైన ఆవు మృతి చెందిందని సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

కొత్త ఆలోచనలు.. సరికొత్త ఆవిష్కరణలు..

- 15 గంటల్లో బైక్ తయారీ చేసిన గౌతమ్
- బ్యాటరీలతో సరికొత్త వాహనాలు డిజైన్
- స్టీరింగ్ లేని కారు, వ్యవసాయానికి ఉపయోగపడే స్ప్రేయర్లు కూడా..


ఈ-బైక్‌లు తయారు చేస్తున్న గౌతమ్


ఉగాది పురస్కారాల్లో గౌతమ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ (ఫైల్)


తాను తయారు చేసిన వాహనంపై కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌తో గౌతమ్ (ఫైల్)


బ్యాటరీతో తయారు చేసిన స్కూటర్


బ్యాటరీతో నడిచేలా తయారు చేసిన బైక్

పార్వతీపురం టౌన్:

పట్టణానికి చెందిన గెంబలి గౌతమ్ విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో డేటా సైన్స్ విద్యను పూర్తి చేశాడు. చూసే ప్రతి కళా ఒడిసి పట్టడమంటే చిన్నప్పటి నుంచి సరదా. అదే అలవాటుగా మారి.. నూతన ఆవిష్కరణలకు బీజం పోసింది. మైక్రో ఆర్ట్ నుంచి వినూత్న వాహనాల తయారీ వరకూ కొత్త ఆలోచనలతో సాగిపోతున్నాడు. రోజురోజుకూ పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో బ్యాటరీతో నడిచే వాహనాలను సొంతంగా తయారు చేసి అందరి మన్ననలను పొందుతున్నాడు. కళాత్మక ఆలోచన నుంచి రూపుదిద్దుకున్న ఆవిష్కరణలను చూసి ఔరా అని అనాల్సిందే. అతి తక్కువ ఖర్చుతో నడిచే స్కూటర్‌ను చూస్తే వావ్ అనాల్సిందే. విభిన్నమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న గౌతమ్ ఆలోచనలను ఒక్కసారి పరిశీలిస్తే..

దివ్యాంగులకు స్టీరింగ్ లేని కారు..

దివ్యాంగుల కోసం దేశంలోనే మొట్టమొదటి స్టీరింగ్ లెస్ కారుని తయారు చేసి దాన్ని రోడ్లపై నడుపుతూ గౌతమ్ అబ్బురపరిచాడు. ఈయన రూపొందించిన కారుకి స్టీరింగ్ ఉండదు. కేవలం రూ.32 వేల ఖర్చుతో డిజైన్ చేసిన కారులో 350 వోల్టుల సామర్థ్యం కలిగిన 2 మోటార్లు, లిథియం బ్యాటరీ, కొంత ఐరన్ వినియోగించాడు. సోలార్‌తో పాటు బ్యాటరీతో నడిచేలా కారుని తయారు చేశాడు. కాళ్ల వద్ద ఏర్పాటు చేసిన సెన్సార్ల ద్వారా ఆపరేట్ అవుతుంది. చేతులు లేని విభిన్న ప్రతిభావంతుల్ని దృష్టిలో పెట్టుకొని ఈ డిజైన్ రూపొందించారు. జీపీఆర్ఎస్ సిస్టమ్, బ్లూ టూత్ వంటి సదుపాయాలూ ఈ కారు సొంతం. దీనికి లైసెన్స్‌తో పనిలేదు. గతంలో అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ కారుని చూసిన జపాన్ బృందం నుంచి గౌతమ్ ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. విశాఖపట్నంలోని ఇద్దరు దివ్యాంగులకు రెండు కార్లు ప్రత్యేకంగా తయారు చేసి వారికి అందజేశారు.

కొత్త ఆవిష్కరణలు..

పెట్రోల్ ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయి. దీనివల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారి సమస్యలకు పరిష్కారాన్ని చూపించేలా సరికొత్త డివైజ్‌లు రూపొందించాడు గౌతమ్. చైనాకు చెందిన హబ్ మోటారు వినియోగించి, బైక్‌లో కొన్ని మార్పులను చేసి లీటర్ పెట్రోల్ గతంలో ఇచ్చిన మైలేజ్ కంటే డబుల్ వచ్చేలా చేశాడు. ఇప్పటికే ప్రాక్టికల్‌గా పరీక్షించిన గౌతమ్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాడు.

తక్కువ ఖర్చుతోనే స్కూటర్..

ఇంట్లో ఉండే పాత ఇనుప సామగ్రిని వినియోగించి కేవలం రూ.13 వేల ఖర్చుతో రెయిన్ బో స్కూటర్‌ను గౌతమ్ రూపొందించాడు. లిథియం బ్యాటరీ, మూలకు చేరిన కొన్ని వాహనాల పరికరాలను వినియోగించి దీనిని తయారు చేశాడు. తన మామయ్య కోరిక మేరకు దీనిని తీర్చిదిద్దానని, అయితే ఎంతోమందికి నచ్చడంతో ఈ తరహా బైక్స్ తయారు చేయాలంటూ ఆర్డర్లు వస్తున్నాయని గౌతమ్ చెబుతున్నాడు.

ఈ-బైక్ తయారీలో

తన స్నేహితుడైన వెల్డర్ జానకి సహాయంతో కేవలం 15 గంటల్లో ఈ-బైక్ రూపొందించాడు. దానిని రెండు గంటలపాటు చార్జింగ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల స్పీడ్‌తో 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. వాహనం తయారీకి పాత ఇనుప సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, స్కూటీ టైర్లు, బీఎల్‌డీసీ మోటార్, లిథియం బ్యాటరీని వినియోగించాడు. యాక్సిలేటర్, ఆటో గేర్ సిస్టమ్, హ్యాండ్ బ్రేక్ ఉపయోగించాడు. రాత్రి కూడా సునాయాయసంగా ప్రయాణించేందుకు వీలుగా బైక్‌కు ఫ్లడ్‌లైట్ అమర్చాడు. పట్టణానికిచెందిన ఓ వ్యాపారి ఎలక్ట్రికల్ పరికరాలు ఉచితంగా ఇవ్వడంతో తన ప్రయోగం వేగంగా 15 గంటలో పూర్తి చేయడం విశేషం.

సత్కారం..

జిల్లాకు చెందిన గౌతమ్ నూతన ఆవిష్కరణలతో ముందుకు వెళ్తూ యువ శాస్త్రవేత్తగా జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. ఇటీవల ఉగాది పురస్కారం అందజేసి సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఏ ఆలోచన వచ్చినా..



ఏ ఆలోచన వచ్చినా వెంటనే అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంటాను. ఇప్పటివరకూ స్టీరింగ్ లెస్ కారుతో పాటు రెయిన్ బో స్కూటర్, రెండింతల మైలేజీ వచ్చేలా బైక్ డిజైన్‌లో మార్పులు చేశాను. సరికొత్త బైక్ తయారీకి ప్రయత్నిస్తున్నాను. రెయిన్ బో స్కూటర్ చాలా మందికి నచ్చడంతో ఇప్పటికే కొంతమందికి డిజైన్‌చేసి అందజేశాను. చిన్నప్పటినుంచి సరికొత్తగా ఆలోచించడం, ఏదో ఒకటి చేయాలన్న తపనతో అనేక విషయాలను నేర్చుకోవడం మొదలు పెట్టాను.

– జి.గౌతమ్, యువకుడు, పార్వతీపురం.

ఏపీటీఎస్‌ఏ నూతన కమిటీ ఏకగ్రీవం


నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఎస్‌ఏ) ఉమ్మడి విజయనగరం జిల్లా శాఖ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా డి.నవీన్‌చంద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.సురేష్‌కుమార్, జిల్లా సెక్రటరీగా కేవీఎస్ఎస్ సింధూర, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.దివ్యభారతి, పి.సంతోష్‌కుమార్, వై.కామినాయుడు, బీవీఎస్ఎం నాయుడు, జాయింట్ సెక్రటరీలుగా వి.సరస్వతమ్మ, టి.అనిల్, ఎస్.రంజిత్‌కుమార్, ట్రెజరర్‌గా జి.ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పి.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్.భాస్కర్, ఎలక్షన్ పరిశీలకుడిగా డి.రమణరెడ్డి వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ, నాయుడు జగన్నాథం, కామరాజు, సత్యం నాయుడు, ఏపీఎన్‌జీఓ జిల్లా, పట్టణ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌బాబు, సురేష్, వై.ఆనంద్‌కుమార్, కనకరాజు, కోశాధికారి ఎస్వీ సుధాకర్, శ్రీకాకుళం, విశాఖపట్నం , తూర్పుగోదావరి, పార్వతీపురం జిల్లాల నుంచి ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీకి పరిశోధనా ప్రాజెక్ట్

- వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి


ప్రాజెక్టు నమూనాను అందుకుంటున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బయోటెక్నాలజీ విభాగానికి రూ.4 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్ట్ మంజూరైంది. శనివారం స్థానిక యూనివర్సిటీ క్యాంపస్‌లో వీసీ టీవీ కట్టిమణి విలేకరులతో మాట్లాడుతూ.. 'గిరిజనులలో సికిల్‌సెల్ ఎనీమియా' అనే ఆరోగ్య సమస్యపై పరిశోధన చేయడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవికి అప్పగించిందని తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో సికిల్ సెల్ వ్యాధి నివారణకు రూ.4 కోట్ల వంతున మంజూరు చేయనున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి చేపడుతున్నారని చెప్పారు. తాజాగా యూనివర్సిటీ తరఫున వచ్చిన ఈ పరిశోధనా మిషన్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆదివాసులపై పరిశోధనలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కర్రల మిషన్‌లో పడి మహిళ మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు


మృతురాలు జ్యోతి


సంఘటనా స్థలంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

గంట్యాడ: పని చేస్తున్న కర్రల మిషనే ఆమె పాలిట యమపాశమైంది. ప్రమాదవశాత్తూ మిషన్‌లో పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తమతో పనిచేసిన మహిళ కళ్లెదుటే మృతి చెందడంతో సహచర కూలీలు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కిడాం గ్రామానికి చెందిన అసకపల్లి జ్యోతి అనే మహిళ, అదే గ్రామానికి చెందిన కొంతమంది మహిళలతో కలిసి సిరిపురం సచివాలయం ఎదురుగా ఉన్న నీలగిరి కర్రల డిపోలో పనికి వచ్చింది. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం నీలగిరి కర్రలను మిషన్‌లో వేస్తుండగా చీర కొంగు మిషన్‌లోకి చిక్కుకు పోవడంతో ఒక్కసారిగా మిషన్‌లో పడిపోయింది. దీంతో ఆమె అక్కడక్కడే మృతి చెందింది. మృతిరాలికి భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడడంతో ఒకరి మృతి

- మరో నలుగురికి గాయాలు


వైద్యసిబ్బందితో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

సీతంపేట: మండలంలోని ఇసుకగెడ్డ వద్ద ఆటో బోల్తాపడిన సంఘటనలో పాలకొండ మండలం వెలగవాడకు చెందిన జి.లక్ష్మణరావు(38) అనే వ్యక్తి మృతి చెందగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆటో ఇసుకగెడ్డ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మణరావు అపస్మారక స్థితికి చేరుకోగా.. మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్య సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం వల్లే లక్ష్మణరావు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మృతుడికి భార్య మేరీ, ఇద్దరు ఆడపిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు.

కథలు అభ్యుదయ భావాలకు ప్రతీకలు

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


స్వీయ రచనల పుస్తకాలను అందజేస్తున్న రచయితలు

విజయనగరం అర్బన్:

ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు కథలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలవడంతో పాటు యువ కథకులకు మార్గనిర్దేశం చేస్తాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విజయనగరంలోని చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో అట్టాడ అప్పలనాయుడు తాను రాసిన నక్షత్రబాట కథా సంపుటిని డీవీజీ శంకరరావుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కథలు, సామాజిక పరిస్థితులపై అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడుతో చర్చించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. విజయనగరం సాహితీ చరిత్రలో కథలకు ఎంతో ప్రాధాన్యముందన్నారు. అప్పలనాయుడు, గౌరినాయుడు వంటి కథా రచయితలు ఎంతో మంది యువ కథకులకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయమన్నారు.

జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ


అరకు కాఫీపై సిబ్బందితో చర్చిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు అందుబాటులోకి తేసుకురానున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పట్టణంలోని ఐటీడీఏ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అరకు కాఫీకి మంచి గుర్తింపు ఉందన్నారు. అరకు కాఫీని అన్ని ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ఇటీవల పార్లమెంట్, శాసనసభలలో అవుట్‌లెట్స్ ప్రారంభించారన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గతంలోనే పెట్రోల్‌బంక్ వద్ద అరకు కాఫీని ప్రారంభించినప్పటికీ.. అనివార్య కారణాల వల్ల మూసివేయాల్సి వచ్చిందన్నారు. దీన్ని మరలా తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈయనతో పాటు ఏపీఓ ఎ.మురళీధర్, సహాయ గణాంకాధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాలివాన


కళ్లేపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన పాడిగేదె

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం ఏకధాటిగా గంటన్నర సమయంపాటు కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కళ్లేపల్లి గ్రామ శివారులోని పశువుల కళ్లం వద్ద పిడుగు పడడంతో భూమిరెడ్డి వెంకటరావుకు చెందిన సుమారు రూ.60వేలు విలువ చేసే పాడిగేదె మృతిచెందింది. రేగ గ్రామంలో పశువులశాల సమీపంలో పిడుగు పడడంతో శాలలో ఉన్న మహిళా రైతు జూరెడ్డి లక్ష్మి అస్వస్థతకు గురైంది. ఆమె కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో కొత్తవలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాలివానకు గోల్డుస్టార్ కూడలిలోని హోర్డింగ్‌లు ఎగిరిపడ్డాయి. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వేడుకగా గురు వందనం

- ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌కు ఘన సత్కారం


ద్వారం దుర్గాప్రసాద్‌కు గురువందన సత్కారం చేస్తున్న శిష్యప్రశిష్య సమాఖ్య ప్రతినిధులు, అతిథులు

విజయనగరం టౌన్: కేంద్ర సాహిత్య నాటక అకాడమీ పురస్కార గ్రహీత, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ అధ్యాపకుడు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావును శిష్యప్రశిష్య సమాఖ్య శనివారం గురువందనం పేరుతో సత్కరించింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన శిష్యులందరూ కలిసి సంగీత కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు ప్రముఖ విద్వాంసులు ద్వారం సత్యనారాయణరావు నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. విశాఖ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ గౌరవ కార్యదర్శి రామదాస రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండా సుధారాణి, కట్టమూరి చంద్రశేఖరం, కేవీపీఎల్ఎన్.శాస్త్రి, చాగంటి కొండలరావు, త్రినాథరావు, చాగంటి రాజ్యలక్ష్మి, ఎం.ధనలక్ష్మి, విజయలక్ష్మి, కళావతి, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

13 ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు


టీటీడీ నుంచి వచ్చిన కంకణాలు, తదితర పూజా సామాగ్రిని అర్చకులకు అందజేస్తున్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 13 ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక టీటీడీ కార్యాలయంలో టీటీడీ నుంచి వచ్చిన కంకణాలు, పసుపు, కుంకుమ, గోవింద నామాలను అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీ సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాల్లో నిర్మించిన 13 ఆలయాల్లో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ప్రసాద్‌భవానీ, అర్చకుడు పీవీ నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.